విద్యాశాఖ.. మొద్దునిద్ర

శిథిలావస్థలో పాఠశాల.. పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరిన గాజులరామారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీ నుంచి జీహెచ్ ఎంసీలో విలీనం అనంతరం డివిజన్, ప్రస్తుతం సర్కిల్‌గా ఏర్పడినా ఆ పాఠశాల మాత్రం ఏమాత్రం మారలేదు. అక్కడ పలక బలపం పట్టి చదువుకున్న వ్యక్తి ఎమ్మెల్యేగా కాగా చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో, ఉన్నత స్థాయిలలో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఆ పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. ఎప్పుడు కూలుతుంతో తెలియని పరిస్థితి నెలకొంది.

- గాజులరామారం గ్రామంలోని మండల పరిషత్ స్కూల్ 50 సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. ప్రస్తుతం ఒకటి నుంచి 5వ తరగతి వరకు గాను 138 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలు వారి, స్లాబులు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది.
- రానున్న వర్షాకాలంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుదోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని కూల్చివేసి ఆ స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.



చినుకు పడితే చిత్తడే...

చినుకు పడిందంటే చాలు వర్షపు నీరు స్లాబ్ నుంచి పాఠశాలలోకి వచ్చి చేరుతోంది. దీంతో పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయమై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా శూన్యం.


బీటలు వారిన స్లాబును చూపిస్తున్న స్థానికులు

ఇటీవల రూ. 2లక్షలు మంజూరు...

మన ఊరి మనబడి కార్యక్రమంలో భాగంగా గాజుల రామారం మండల పరిషత్ స్కూల్ కు మరమ్మత్తుల నిమిత్తం రూ.2లక్షలు మంజూరయ్యాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవనానికి బదులు రెండు గదులతో కూడిన కొత్త భవనంలో ఉన్న కరెంటు మరమ్మతులకు రూ.50 వేలు ఖర్చు పెట్టారు. మిగతా రూ.1.5లక్షలు అలాగే ఉన్నాయి.

అధికారులు పట్టించుకోవాలి



శిథిలావస్థ చేరిన పాఠశాల భవనం విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ వేసవి కాలంలో పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మిస్తే బాగుండేది. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయలేదు. వర్షాకాలంలో జరగరానిది ఏదైనా జరిగితే దీనికి బాధ్యులు ఎవరు.? ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించాలి.

– కిరణ్, గాజులరామారం

ప్రతిపాదనలు రూపొందించాం



గాజులరామారంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనను రూపొందించి పై అధికారులకు నివేదించాం. త్వరలో పాత భవనాన్ని కూల్చివేస్తాం. ఆ స్థానంలో కొత్త భవనం నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– వసంతకుమారి, కుత్బుల్లాపూర్ ఎంఈఓ

నేటి నుంచి మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు

మల్కాజిగిరి: మౌలాలి డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని మహాలక్ష్మి ఆలయం 22వ వార్షికోత్సవాలు శనివారం నుంచి మూడు రోజులు కొనసాగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పైళ్ల బుచ్చిరెడ్డి, కేబీ ప్రసాద్ తెలిపారు. శనివారం విష్వక్సేన ఆరాధన, కలశ స్థాపన, మహా గణపతి హోమం, 2వ తేదీ ఆదివారం సుదర్శన హోమం, సంతానవేణుగోపాల హోమం, సాయంత్రం మహాలక్ష్మి హోమం, కుంకుమార్చన, 3వ తేదీ చివరి రోజు సోమవారం మహాపూర్ణాహుతి, శత కలశాభిషేకం, పల్లకీ సేవ, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

సేవలో యువత భాగస్వాములు కావాలి

బోడుప్పల్: సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి కుమారుడు, బీఆర్ఎస్ యువ నాయకుడు మనోహర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ చదువుకున్న వారు, విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. సంజీవ్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, యువ నాయకులు పులకండ్ల కీర్తన్‌రెడ్డి, ఉప్పరి విజయ్, మోతే రాజు, శ్రీహరిగౌడ్, వినయ్, పురుషోత్తం శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

4న శ్రీదుర్గా జ్యోతిషాలయంలో పూజలు

గౌతంనగర్: మాసశివరాత్రి పురస్కరించుకొని ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిషాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6:30కు స్పటిక లింగానికి అభిషేకాలు, పూజలు, మహారుద్రయాగం నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీవిష్ణు, శివాలయ దేవస్థానం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలోని అక్కన్న మాదన్న కాలంలో నిర్మించిన శ్రీవిష్ణు, శివాలయాల బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవా, గోపూజ, విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, నాదస్వర గోష్టి, స్వామివార్లకు అభిషేకాలు జరిగాయి. కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అలివేలు మంగ సహిత బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌ముదిరాజ్, ఈఓ భాగ్యలక్ష్మీ ఆలయంలో వివిధ హుండీలు ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ పర్యవేక్షణలో చేపట్టిన లెక్కింపులో రూ.1,11,580లు ఆదాయం వచ్చిందని చైర్మన్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయం డైరెక్టర్ నవీన్‌కుమార్‌ముదిరాజ్, లింగంముదిరాజ్, శేఖర్, మాజీ సర్పంచ్ గీతశ్రీనివాస్, నాయకులు పెంటయ్యముదిరాజ్, వెంకటేశ్‌ముదిరాజ్, నరసింహ, ఆలయ పూజారి వినయ్ శర్మ పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న చైర్మన్ వేణుగోపాల్‌ముదిరాజ్, ఈఓ భాగ్యలక్ష్మి

ఉద్యోగ విరమణ సత్కారం


ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్‌ను సత్కరిస్తున్న కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్‌గౌడ్

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి గౌరీశంకర్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మెట్టు నర్సింహారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదానం

మేడ్చల్‌రూరల్: సీఎంఆర్ ఆస్పత్రి చైర్మన్ చామకూర గోపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం సీఎంఆర్ మెడికల్ కళాశాల విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది రక్తదానం చేశారు. సీఎంఆర్ ఆస్పత్రిలో రక్తదానం చేసి పేద రోగులకు అండగా నిలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, ఆస్పత్రి డీన్ వెంకటరమణ, డైరెక్టర్ అలీబేగ్, ఏఓ సురేశ్, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పొగాకు నియంత్రణకు సహకరించాలి


శామీర్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శామీర్‌పేట్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం శామీర్‌పేట మండల పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టమే అని, శరీర అవయవాలపై పొగాకు తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డా.శ్రీకాంత్, డా.రవీందర్‌బాబు, రాకేష్, సృజన, సంగీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఉప్పల్: సీఎం రిలీఫ్ ఫండ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాప్రా కందిగూడ ప్రాంతానికి చెందిన జె.నర్సింగ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతడికి వైద్య సహాయం చేయాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కోరడంతో స్పందించిన పరమేశ్వర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,10,000ల ఎల్‌వోసీ పత్రాన్ని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాఘవరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలకు ఆంక్షలు విధించారని, మహాలక్ష్మీ పథకానికి కొర్రీలు పెడతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 15 లక్షల 2 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా కేవలం 2 లక్షల 19 మంది లబ్ధిదారులకు మాత్రమే గృహలక్ష్మీ పథకం అమలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి ప్రతి ఒక్కరికీ ఉచిత విద్యుత్ పథకం అందించాలని డిమాండ్ చేశారు.

మహంకాళి ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి మహంకాళి అమ్మవారి ఆలయంలో సీసీ కెమెరాలను వైస్ చైర్మన్ బండారి మల్లేష్ శుక్రవారం ప్రారంభించారు. కెమెరాలు ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ నాయకుడు అంజయ్య గౌడ్ రూ.60 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో దాత అంజయ్య గౌడ్‌తో పాటు స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నకిలీ క్లినిక్ సీజ్

రామంతాపూర్: ఇందిరానగర్ డీమార్ట్ వీధిలో ఎటువంటి వైద్య విద్యార్హతలు లేకుండా సురేష్ అనే వ్యక్తి నడుపుతున్న సాయి పాలి క్లినిక్‌ను శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఉన్నతస్థాయి స్టెరాయిడ్స్ అనస్థిషియా, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, సదరు నకిలీ వైద్యుడు సరైన అర్హత లేకుండా డాక్టర్ పేరు తగిలించుకుని చట్ట విరుద్ధంగా చికిత్సలు చేస్తున్నాడని అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లో పడకలను ఏర్పాటు చేయడం, ఇన్‌ఫెక్షన్, నమూనా సేకరణ పాయింట్, నకిలీ వైద్యం నిర్వహిస్తున్నాడని వారు పేర్కొన్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా బస్తీలు, కాలనీల్లో డాక్టర్ల పేరుతో నకిలీ డాక్టర్లు నిర్వహిస్తున్న ఆస్పత్రులపై దాడులు ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. కీసర డివిజనల్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.నారాయణరావు వెంకట్‌రెడ్డినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మంజుల శారదానగర్, బస్తీ దవాఖానా వైద్యాధికారిణి వైశాలి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధా, పి.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


నకిలీ వైద్యుడు సురేష్‌కు నోటీసు అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

సీఎంఆర్ఐటీ విద్యార్థులకు మెడల్స్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల విద్యార్థులు క్వాన్ కీడో పోటీల్లో సత్తాచాటారు. రాజస్థాన్‌లోని జేజేటీ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్వాన్-కీడో పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. విద్యార్థి వంశీమోహన్‌రెడ్డి సిల్వర్ మెడల్ సాధించగా, గౌతమ్‌రెడ్డి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, పీడీ మోహన్‌రావు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించి సత్కరించారు.


మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ జంగారెడ్డి

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్, సోమారం గ్రామాల్లో మండల విస్తీర్ణాధికారి తేజస్విని రైతులకు విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాల్లో రైతులు వ్యవసాయశాఖ గుర్తింపు ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, రసీదు తప్పనిసరి తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్


పోలీస్‌స్టేషన్ సీజ్ చేసిన వాహనాలతో సీఐ హనుమాన్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న పలు వాహనాలను మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు తాత్కాలికంగా సీజ్ చేశారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ హనుమాన్‌గౌడ్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు వాహనాలను నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై తిరుగుతుండగా వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. మూడు ఫోర్ విల్లర్, 17 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. వాహనదారులను కౌన్సిలింగ్ నిమిత్తం మాదాపూర్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని సీఐ ఆదేశించారు.

కుషాయిగూడలో మెడికల్ కాలేజీ..?

కుషాయిగూడ: కుషాయిగూడలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కుషాయిగూడ పాత కూరగాయాల మార్కెట్ సమీపంలోని బహుళ అంతస్తుల భవనానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. అయితే కుత్బుల్లాపూర్ నియోజవర్గానికి మంజూరైన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మెడికల్ కళాశాలను ఇక్కడికి మార్చినట్లు తెలిసింది. కుత్బుల్లాపూర్ చేపట్టిన మెడికల్ కళాశాల భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో తాత్కాలికంగా కుషాయిగూడలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల కూడా కుషాయిగూడలో ఉండటం గమనార్హం.


కుషాయిగూడలో ఏర్పాటు చేయనున్న జిల్లా మెడికల్ కళాశాల భవనం

వర్షాకాలం.. 24/7 కంట్రోల్ రూమ్

మేడిపల్లి: ఈ వర్షాకాలంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వరదల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మున్సిపల్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. వర్షాలు, వరదలతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించి మాన్సూన్ టీం సేవలను పొందాలని కోరారు.

కంట్రోల్ రూమ్ నంబర్: 91549 99303.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ హిల్స్ కురుమానగర్ ప్రాంతానికి చెందిన మొగలయ్య సుల్తాన్‌బజార్ పీఎస్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తుండగా రామంతాపూర్ ప్రగతినగర్ వద్ద బోరు వెల్ వాహనం ఢీకొట్టింది. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మర్చురీకి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఐటీ పార్కు ఫీడర్ పరిధిలోని ఇన్ఫోసిస్ హాస్టల్స్, సెరీన్ హిల్స్, పోచారం గ్రామంతో పాటు శివాలయం పరిసర ప్రాంతాలు, అన్నానగర్, నాగారం డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఏవీ కన్‌స్ట్రక్షన్స్, అగాపే ఆర్ఫానేజ్ ప్రాంతాలకు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఏ1 నుంచి ఏ50, సీ1 నుంచి సీ10, డీ1 నుండి డీ4 బ్లాకులకు, పల్లవి మోడల్ స్కూల్ ప్రాంతాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఘట్‌కేసర్ సబ్ స్టేషన్ పరిధిలో..

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యంనంపేట్, తిరుమల ఎన్‌క్లేవ్, శ్రీరాం ఎన్‌క్లేవ్, ఎంఎల్ఆర్ కాలనీ, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, సప్తగిరి కాలనీ, శ్రీనివాస్‌నగర్, నవదుర్గ కాలనీ, విహారి హోమ్స్, హెవెన్స్ కాలనీలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శివారెడ్డిగూడ, మారుతినగర్, బండారి అపార్ట్‌మెంట్, యాదాద్రి రెసిడెన్సీ, తహసీల్దార్ ఆఫీస్ ప్రాంతం, మైసమ్మగుట్ట, ఘనాపూర్ గ్రామ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సతీష్ కుమార్ తెలిపారు.

వారాంతపు సంతల సమాచారం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతివారం కూరగాయాలు, ఇతర సామాగ్రి విక్రయించే వారాంతపు సంతల సమాచారం.. సోమవారం - రైల్వే స్టేషన్ రోడ్డు (పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి, మంగళవారం-ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్, బుధవారం- ఎన్‌జీఓస్ కాలనీ(మేడ్చల్), గురువారం-వీకర్ సెక్షన్ కాలనీ(జెడ్పీహెచ్ఎస్ స్కూల్ వద్ద), శుక్రవారం-సూర్యనగర్, చంద్రానగర్, శనివారం-హౌజింగ్ బోర్డ్ కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ, ఆదివారం- ప్రధాన మార్కెట్.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ


నరేష్‌ను పరామర్శిస్తున్న శంకర్, శివబాబు

జవహర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికులను శుక్రవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు శివబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదానికి గురైన మున్సిపల్ కార్మికులు రవి, నరేష్‌ను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రవి కుడి చెయ్యి పూర్తిగా కోల్పోవడం కలిచివేసిందన్నారు. వారి కుటుంబాలకు కార్మిక సంఘాలు అండగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు జైలు

మేడ్చల్: భార్య గర్భిణిగా ఉండగానే ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన మృగాడికి మేడ్చల్ న్యాయస్థానం ఎనిమిదిన్నరేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చింతల్‌కు చెందిన నిఖిలతో మహేందర్‌కు 2020లో వివాహం జరిగింది. 2021 సంవత్సరంలో ఆమె గర్భిణిగా ఉన్న సమయంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో 2021 సెప్టెంబర్‌లో ఆత్మహత్య చేసుకుని మరణించింది. ఆమె సోదరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మేడ్చల్ అడిషనల్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి శుక్రవారం పైవిధంగా తీర్పు వెల్లడించారు. భార్య మృతికి కారణమైన భర్తకు ఎనిమిదిన్నరేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపారు.

రక్షణ చర్యలు చేపట్టని ఇంటి యజమాని, మేస్త్రిపై కేసు

ఘట్‌కేసర్: ఇంటి నిర్మాణంలో రక్షణ చర్యలు చేపట్టని ఇంటి యజమానిపై ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్ వీబీఐటీ కళాశాల సమీపంలో రాహుల్ అనే వ్యక్తి కొత్త ఇంటిని నిర్మిస్తున్నాడు. పని ఉందని మేస్త్రీ జానీ, బాల్‌రాజ్ అనే దినసరి కూలీలను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో బాల్‌రాజ్ ఇంటి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడిపోయాడు. దీంతో ఆతడి తల, వెన్నెముక, కాళ్లకు గాయాలయ్యాయి. వైద్యం చేయిస్తామని చెప్పి బాల్‌రాజ్‌ను సమీపంలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి అతడి భార్య సుగుణకు అప్పగించి వెళ్లిపోయారు. రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మేస్త్రి జానీతో పాటు ఇంటి యజమాని రాహుల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన అద్దంకి శ్రీనివాస్ శివరాజ్‌కుమార్(42) ఘట్‌కేసర్‌లో రేడియం షాప్ నడిపిస్తున్నాడు. కుటుంబ కలహాలతో తరచూ భార్యతో గొడవ పడేవాడు. గురువారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఇంటిలోని ఓ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



శామీర్‌పేట్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి సమయంలో శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ ప్రజయ్ హోమ్స్ మెయిన్ వద్ద ఓ మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు ఉంటాడని, వ్యక్తి నలుపు రంగులో ఉన్నాడని తెలిపారు. నీలం రంగు షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గాంధీ మర్చురీకి తరలించారు. మృతుడి వివరాల తెలిసిన వారు శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ఉప్పల్: మేడ్చల్- పొగాకు ఉత్పత్తులు, వాటి వినియోగంతో వచ్చే నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.టి.రఘునాథ్ స్వామి ఆధ్వర్యంలో ఉప్పల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.